తహసీల్దార్‌ను తప్పించాలి

- శివ్వాం దళితుల భూమి సమస్యను పరిష్కరించాలి
- వ్యవసాయ కార్మిక సంఘం, కేవీపీఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆవరణలో ధర్నా



ర్యాలీలో పాల్గొన్న వసాయ కార్మిక, కేవీపీఎస్, రైతు సంఘం నాయకులు

పార్వతీపురంటౌన్: జిల్లాలోని గరుగుబిల్లి తహసీల్దార్‌పై సస్పెన్షన్ విధించి విధుల నుంచి తప్పించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు వ్యవసాయ కార్మిక, కేవీపీఎస్, రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం జిల్లాకేంద్రం పార్వతీపురంలోని సుందరయ్య భవనం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివ్వాం గ్రామం దళితులు కొన్నాళ్లుగా సాగు చేసుకుంటున్న భూమిపై పెత్తందార్లకు అనుకూలంగా గరుగుబిల్లి తహసీల్దార్..కలెక్టర్‌కు, బాధితులకు అందించిన నివేదికలో చాలా అవకతవకలున్నాయని ఆరోపించారు. ఇది మోసపూరిత నివేదిక అని మండిపడ్డారు. కలెక్టరేట్ నుంచి సర్వే సెటిల్‌మెంట్, ల్యాండ్ రికార్డ్స్ కమిషనర్ రాసిన ఉత్తరం, ఆర్డీఓ నివేదిక, గరుగుబిల్లి తహసీల్దార్ నివేదిక బాధితులకు అందిన ప్రకారం తహసీల్దార్ నివేదిక అవాస్తవాలతో కూడుకుని ఉందని ధ్వజమెత్తారు. తహసీల్దార్ ఇచ్చిన నివేదికలో ఎస్ఎఫ్ఏలో, నోషనల్ ఖాతాలో కూడా దళితుల పేర్లు నమోదై ఉన్నాయి తప్ప డి.పట్టాలు ఇవ్వలేదని కావున, వారికి ఎటువంటి ఆధారాలు లేవని తహసీల్దార్ నివేదికలో పేర్కొనడం దుర్మార్గమన్నారు. డి.పట్టాలు దళితులకు ఇవ్వకపోతే గుండ్రెడ్డి సుబ్బనాయుడు తదితరులు దళితులపై ఇంజక్షన్ ఆర్డర్ కోరుతూ కోర్టుకు ఎందుకు వెళ్లినట్లని ప్రశ్నించారు. ఎస్ఎఫ్ఏలో స్పష్టంగా నమోదు చేసి ఉందని, దళితుల సాగులో ఉన్నట్లు వన్‌బీలో కూడా నమోదై ఉందన్నారు. ఇవన్నీ అబద్ధాలా? లేదా దళితులే రెవెన్యూ రికార్డులు రాసుకున్నారా? అని ప్రశ్నించారు. ఆ వాస్తవాలను కప్పిపెట్టేందుకు తహసీల్దార్ ఈ విధంగా నివేదికను పొందుపరిచారని వివరించారు. కోర్టు వివాదంలో ఉన్న 22.80 ఎకరాలకు బదులు 36 సర్వే నంబర్ చూపిస్తున్నారని, కోర్టు వివాదంలో ఉన్న సర్వే నంబర్ 28, 30 తప్పించి 36వ సర్వే నంబర్‌ను చూపిస్తుండడం ఎంత విడ్డూరమని ఆశ్చర్యం వెళ్లగక్కారు. సర్వే నంబర్ 36 వివాదంలో ఉంటే కొన్నేళ్ల క్రితం ఆ భూమికి డీ పట్టాలు ఎలా అందించారని మండిపడ్డారు. అలాగే వివాదంలో ఉన్న 20 ఎకరాల భూముల్లో గొర్రెల సత్యం, మరో ముగ్గురు ఉన్నట్లు తహసీల్దార్ నివేదికలో ఉందని, దళితులు జూన్ 19 నుంచి 25 వరకు 7 రోజులు భూమిని దున్ని వరి నారు వేసిన విషయం అందరికీ తెలుసని స్పష్టం చేశారు.

దళితులపై కుట్ర

రెండు రోజుల తర్వాత పెత్తందారులు 100 మందిని తీసుకువచ్చి దళితులపై దాడి చేయడం దానికి గరుగుబిల్లి ఎస్సై, ఏఎస్సైలే సాక్ష్యమన్నారు. నిజంగా గొర్రెల సత్యం మరో ముగ్గురు ఆ భూమిలో సాగుచేస్తుంటే దళితులు వారం రోజులు సాగు చేపడితే ఎందుకు అడ్డుకోలేదని నిలదీశారు. ఇదంతా దళితులపై కుట్రపూరితమైన దాడి గనుక ఏ రెవెన్యూ అధికారి ఆ గ్రామానికి ఇంతవరకు వెళ్లలేదని అన్నారు. తహసీల్దార్ వెళ్లకపోవడం చట్టరీత్యా నేరమే కాకుండా 2014లో హైకోర్టు ఇంజక్షన్ ఆర్డర్ పక్కన పెట్టిన దగ్గర నుంచి దళితులే ఆ భూమి సాగు చేసుకుంటున్నారని, తహసీల్దార్ పెత్తందార్లతో కుమ్మక్కైన కారణంగా తప్పుడు నివేదిక ఇచ్చి కలెక్టర్‌ను తప్పుదోవ పట్టించారని భావిస్తున్నామన్నారు. తప్పుడు నివేదిక ఇచ్చి తప్పుదోవ పట్టించిన గరుగుబిల్లి తహసీల్దార్‌పై సస్పెన్షన్ విధించి విధుల నుంచి తప్పించి తగు చర్యలు చేపట్టి, దళితులకు న్యాయం చేయాలని కోరారు. అలాగే దళితులను కులం పేరుతో తిట్టి దాడి చేసిన పెత్తందాలను ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టప్రకారం అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రేగిడి ఎల్లమ్మ, యచ్చుట కిరమ్మ, రేగిడి అప్పలస్వామి, తెర్లింగి లక్ష్మణరావు, ఐద్వా జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి, సీఐటీయూ నాయకులు బి.సూరిబాబు, జి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేల బావుల మరమ్మతులు


బూస్టర్ పంప్ హౌస్ మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

పార్వతీపురం టౌన్: తోటపల్లి రిజర్వాయర్ నేల బావుల మరమ్మతులు చేపట్టామని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు తోటపల్లి బూస్టర్ పంప్ హౌస్ మరమ్మతు పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మూడు రోజుల పాటు కురిసిన వర్షాలకు పార్వతీపురం పట్టణానికి నీటిని సరఫరా చేసే నేలబావులు మరమ్మతుల బారిన పడ్డాయని తెలిపారు. రెండు నేల బావులను అందుబాటులోకి తెచ్చి తాగునీటిని సరఫరా చేసేందుకు పూర్తి చర్యలు చేపట్టి పట్టణ ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు. అందులో భాగంగా యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు పూర్తి చేశామని మున్సిపల్ కమిషనర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

గరుగుబిల్లి: స్కూల్ బస్సులు నడిపే డ్రైవర్లు మోటార్ వెహికల్ చట్టంలోని నిబంధనలు కచ్చితంగా పాటించాలని స్థానిక ఎస్ఐ పి.రమేష్‌నాయుడు అన్నారు. మండలంలోని గొట్టివలస కూడలి వద్ద బుధవారం పలు పాఠశాలలకు చెందిన బస్ డ్రైవర్లకు మోటార్ వెహికల్ చట్టంలోని నిబంధనలపై అవగాహన కల్పించారు. అతి వేగంగా, నిర్లక్ష్యంగా వాహనం నడిపితే చట్టం ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. బస్‌కు సంబంధించిన అన్ని ధ్రువపత్రాలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. పిల్లలను సురక్షితంగా వాళ్ల ఇంటికి చేర్చే బాధ్యత పాఠశాల యాజమాన్యం, డ్రైవర్లదేనన్నారు.

డిగ్రీ కళాశాలలో వనమహోత్సవం

సీతంపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో బుధవారం వనమహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. 60 మొక్కలతో నర్సరీ ఏర్పాటు చేసినట్టు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ప్రభాకర్ తెలిపారు. ఎకోక్లబ్ కోఆర్డినేటర్ ఫణికుమారి, శంకరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలికి సన్మానం


రామలక్ష్మీని సన్మానిస్తున్న కాలనీ వాసులు

పాలకొండ: పట్టణంలోని ఇందిరానగర్ కాలనీ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయిని రామలక్ష్మీని స్థానికులు బుధవారం సన్మానించారు. ఇటీవల రామలక్ష్మీ ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపిక కావడంతో పాఠశాల సిబ్బంది, కాలనీ వాసులు ఆమెను సన్మానించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అడపా బాబ్జీ, కాలనీ వాసులు, విద్యాకమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కవితా పోటీల్లో దేవానంద్ ప్రతిభ

గుమ్మలక్ష్మీపురం: జాతీయ కవితా పోటీల్లో గుమ్మలక్ష్మీపురం గ్రామానికి చెందిన పాలక దేవానంద్ ప్రతిభ కనబరిచారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ.. సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ(శ్రీశ్రీ కళావేదిక) జాతీయ స్థాయిలో 'జాతి కీర్తి శిఖరం ఎన్టీఆర్' అనే శీర్షికతో కవితా పోటీలు నిర్వహించగా.. అందులో తాను రాసిన కవితకు ప్రశంసలు వచ్చాయన్నారు. శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, జాతీయ కన్వీనర్ కొల్లి రమాదేవి ప్రశంసాపత్రాన్ని అందజేసినట్లు దేవానంద్ తెలిపారు.

ఒడిశాకు తరలిపోతున్న యూరియా


ఒడిశా గ్రామాలకు తరలిపోతున్న ఎరువుల బస్తాలు

భామిని: భామిని మండలంలోని ప్రైవేటు ఎరువుల డీలర్ల నుంచి యూరియా ఎరువు యథేచ్ఛగా సరిహద్దు ఒడిశా గ్రామాలకు అక్రమంగా తరలిపోతున్నదని బత్తిలి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒడిశాలో యూరియా సరఫరా లేకపోవడంతో ఆంధ్రా యూరియాకు డిమాండ్ పెరిగింది. ప్రభుత్వం రైతు సేవా కేంద్రాలకు బదులు ప్రైవేటు డీలర్లకు ఎరువులు సరఫరా చేయడంతో వారు ఒడిశాకు అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారని మండల కో–ఆప్షన్ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకుడు విశ్వనాథ్ పట్నాయక్ బుధవారం ఆరోపించారు. స్థానిక అధికారులు పట్టించుకోకపోవడంతో బత్తిలి నుంచి యూరియా సరిహద్దులు దాటుతోందని విమర్శించారు. ఈ మేరకు మండల అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే ప్రైవేటు డీలర్లకు సరఫరా చేసిన ఎరువుల పంపిణీ విధానంపై దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు.

రైతులు,కౌలురైతుల ఆర్థిక సమస్యలు పరిష్కరించాలి


సచివాలయ అధికారికి వినతిపత్రం అంద జేస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

సీతానగరం: రాష్ట్రప్రభుత్వం ప్రకటించిన పెట్టుబడి సాయం రూ.20 వేలు రైతుల ఖాతాల్లో వేస్తామని చెప్పినా ఇంతవరకూ అమలు చేయకపోవడంతో ఖరీఫ్ పంట సాగు చేస్తున్న రైతులు, కౌలు రైతుల సమస్యలను ఎదుర్కొంటున్నారని, ఎవరూ వారిని పట్టించుకోవడం లేదని ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఆర్.లక్ష్మునాయుడు అన్నారు. ఈ మేరకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలతో వినతిపత్రాన్ని పెదభోగిలి సచివాలయం అధికారి సంతోష్‌కుమార్‌కు బుధవారం అందజేశారు.అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఖరీఫ్‌సీజన్ ప్రారంభమై మూడు నెలలు కావస్తున్నా వ్యవసాయానికి పెట్టుబడుల కోసం బ్యాంక్‌లు, ప్రైవేట్ వడ్డీవ్యాపారస్తుల చుట్టూ తిరగాల్సి వస్తున్నా రుణాలు పుట్టకపోవడంతో రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తోందని, ప్రభుత్వం వెంటనే రైతుల ఇచ్చిన హామీని పరిష్కరించడానికి సిద్ధంగా ఉన్నామని చెబుతూ ఎన్నికల సందర్భంగా రైతుల ఖాతాల్ల రూ.20 చొప్పున రైతుల ఖాతాల్లో జమచేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఎన్‌సీఎస్ చక్కెర కర్మాగారాన్ని ప్రభుత్వమే క్రషింగ్ చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఎం.అచ్యుత రావు, బి.లక్ష్మణరావు, ఎం సింహాచలం, వెంకటరమణ పాల్గొన్నారు.

ఘనంగా గణనాథుని నిమజ్జనం


ఎం.పాలికవలసలో అన్నసమారాధన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

మక్కువ: వినాయకచవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అయిదవరోజు బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో భక్తులు ఘనంగా గణనాథుని నిమజ్జనం నిర్వహించారు. మండలకేంద్రం మక్కువ, కొండబుచ్చమ్మపేట, ఎం.పాలికవలస గ్రామాల్లో ఈ సందర్భంగా అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయా గ్రామాలలో వినాయకుని నిమజ్జనంలో పాల్గొన్నారు. మహిళలు, చిన్నారులు, యువత డ్యాన్సులు చేస్తూ ఉత్సాహంగా విగ్రహం వెంట వీధుల్లో తిరిగిరారు.


ములగలో అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

వాడవాడలా అన్న సమారాధన

పార్వతీపురం: మండలంలోని చినబొండపల్లి, గంగాపురం, ములగ, ఎమ్మార్‌నగరం, పుట్టూరు తదితర గ్రామాల్లో వినాయక చవితి మహోత్సవాల్లో భాగంగా బుధవారం ఆయా గ్రామాల్లోని వినాయక మంటపాల వద్ద అన్న సమారాధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో యువత, మహిళలు, పెద్దలు సామూహికంగా పాల్గొన్నారు. అన్న సమారాధన కార్యక్రమంలో కుల మతాలకు అతీతంగా అన్ని వర్గాల వారు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. భక్తి శ్రద్ధలతో పూజల్లో పాల్గొన్నారు.

షాపు అద్దె అక్రమాలపై ఫిర్యాదు

సాలూరు: స్థానిక మున్సిపల్ కాంప్లెక్స్‌లో 20వ నంబర్ షాపు అద్దె అక్రమాలపై ఏసీబీ, విజిలెన్స్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు మున్సిపల్ వైస్‌చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, కౌన్సిలర్‌లు గిరిరఘు, రాపాక మాధవరావు, పప్పల లక్ష్మణరావు తదితరులు తెలిపారు. ఈ మేరకు బుధవారం వారు పట్టణంలో విలేకరులతో మాట్లాడుతూ, ఈ షాపును 2017లో ఎన్.సాయికృష్ణ అనే వ్యక్తి అద్దెకు తీసుకున్నారన్నారు. మున్సిపాలిటీకి ఆయన బకాయం నేటివరకు రూ.11 లక్షలు ఉందని, వడ్డీతో కలిపి అది రూ.15 లక్షలకు బకాయి చేరిందని చెప్పారు. బకాయి సొమ్మును సదరు వ్యక్తి నుంచి మున్సిపల్ అధికారులు ఎందుకు వసూలు చేయలేదన్నది అంతుచిక్కని ప్రశ్నగా మారిందని, ఈ విషయంపై పలుమార్లు అధికారులను నిలదీసినప్పటికీ వారి నుంచి సరైన సమాధానం రావడం లేదన్నారు. ఈ నేపథ్యంలో దీనిపై విజిలెన్స్, ఏసీబీతో పాటు కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన


భామిని పీహెచ్‌సీలో నల్లబ్యాడ్జీ ధరించి విధులు నిర్వహిస్తున్న డాక్టర్ సంతోషిలక్ష్మి

భామిని: మండలంలోని భామిని, బత్తిలి, బాలేరు పీహెచ్‌సీల్లో వైద్యులు బుధవారం నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ప్రభుత్వం విడుదల చేసిన జీఓ 85కి వ్యతిరేకంగా ఏపీ పీహెచ్‌సీడీఏ పిలుపు మేరకు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరైనట్లు తెలిపారు. కరోనా కష్టకాలంలో ప్రాణాలకు తెగించి వైద్యసేవలు అందించామని, అలాంటి పీహెచ్‌సీ వైద్యుల సర్వీస్‌కు అర్థం లేకుండా చేసిన జీఓ 85ను రద్దు చేయాలని కోరారు. ఉన్నత చదువు పీజీకి వెళ్లే అవకాశాలు లేకుండా చేసిన ఈ జీవోను రద్దు చేసే వరకు ఉద్యమం కొనసాగిస్తామన్నారు.

ఉత్సాహంగా స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు


ఖోఖో ఆడుతున్న విద్యార్థులు

భామిని: స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో బుధవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఆర్.శివకుమార్ పోటీలను ప్రారంభించారు. మండలంలోని వివిధ ఉన్నత పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. కన్వీనర్ శివరాంప్రసాద్ ఆధ్వర్యంలో పీఈటీలు పోటీలను పర్యవేక్షించారు. సీఆర్పీలు టి.ప్రసాద్, చిన్నబాబు, కిశోర్‌కుమార్, సంజీవ్ సహకరించారు. ఎంపికైన విద్యార్థులు నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు


సుంకిలో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ పైడితల్లి

గరుగుబిల్లి: తుఫాను కారణంగా గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపడుతున్నట్లు ఎంపీడీఓ జి.పైడితల్లి అన్నారు. మండలంలోని సుంకి, సంతోషపురం, తోటపల్లి తదితర గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణను బుధవారం ఆమె పరిశీలించారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామన్నారు. రక్షిత పథకాలు, మంచినీటి బోర్లు వద్ద మురుగునీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. రహదారులపై మురుగునిల్వలు లేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని కార్యదర్శులను ఆదేశించారు. ఆమె వెంట ఈఓపీఆర్డీ ఎల్.గోపాలరావు, సిబ్బంది ఉన్నారు.

కంపోస్టు తయారీపై దృష్టి సారించాలి


తోటపల్లిలోని చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ పైడితల్లి

గరుగుబిల్లి: సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్(ఎస్‌డబ్ల్యూపీసీ)ల ద్వారా వర్మీ కంపోస్టు తయారుచేయాలని ఎంపీడీఓ జి.పైడితల్లి అన్నారు. మండలంలోని తోటపల్లి, సుంకి గ్రామాల్లో ఉన్న చెత్త సంపద కేంద్రాలను(ఎస్‌డబ్ల్యూపీసీ)బుధవారం ఆమె పరిశీలించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని పంచాయతీల్లో చెత్త సంపద కేంద్రాలను అందుబాటులోకి తీసుకురావాలని, అక్టోబర్ 2 నాటికి వర్మీ కంపోస్టును తయారీని ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. వర్మీ కంపోస్టును పంటలకు ఎరువుగా వేసుకోవడం ద్వారా నాణ్యమైన ఆహార ఉత్పత్తులు పొందవచ్చన్నారు. చెత్త సంపద కేంద్రాల ఆవశ్యకత, వర్మీ కంపోస్టు వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

ఇదెక్కడి న్యాయం?


మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు రూరల్: విజయవాడ వరదలకు పూర్తి బాధ్యత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిదేనని, విపత్తు ముందుందని అధికారులకు తెలిసినప్పుడు ప్రజలను అప్రమత్తం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై లేదా అని మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర ప్రశ్నించారు. ఈ మేరకు బుధవారం ఆయన విజయవాడ వరదబాధితుల కోసం మాట్లాడుతూ బుడమేరు విజయవాడ దుఃఖదాయిని అని తెలిసికూడా ముందస్తు జాగ్రత్తలు తీసుకోకుండా ప్రభుత్వం నిర్లక్షంగా వ్యవహరించిందని ఆరోపించారు.దాదాపు 4 లక్షల జనాభా ఉన్న పట్టణానికి వరద ముప్పు ఉందని తెలిసిన వెంటనే ఎందుకు అప్రమత్తం చేయలేకపోయారని ప్రశ్నించారు. రెవెన్యూఅధికారులు, విపత్తుల నిర్వహణ శాఖ, మైన్స్, ఇంజినీరింగ్ అధికారులు బాధ్యతగా ప్రజలను అప్రమత్తం చేయాలి. నాలుగుసార్లు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనుభవం ఎక్కడ పెట్టారో అర్థం కావడం లేదని ఎద్దేవా చేశారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి విజయవాడలో రిటైనింగ్ వాల్ కట్టకపోతే కృష్ణలంక ప్రజలు ఎక్కడుండేవారోనన్నది తెలుసుకోకుండా జగన్ కారణంగానే ఈ విపత్తు సంభవించిందని ఆరోపణలు చేయడం చంద్రబాబునాయుడు చేసిన తప్పును కప్పిపుచ్చుకోడానికేనన్నా రు. తప్పు ఎవరు చేశారో తెలియాలంటే సీబీఐతో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. వరద బాధితులకు సహాయక చర్యలు చేపట్టకుండా జగన్‌పై ఆరోపణలు చేయడానికి ప్రాధాన్యం ఇస్తున్న చంద్రబాబునాయుడు అనుభవం ఎంతో అర్థమవుతోందని ఎద్దేవా చేశారు. విజయవాడ వరదలకు ఎవరు బాధ్యులో తెలియాలంటే వెంటనే సీబీఐతో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు.

వరిలో తెగులు నివారణకు జాగ్రత్తలు పాటించాలి


వరిచేను పొలంలో రైతులకు శిక్షణ ఇస్తున్న ఏఓ ఎస్ అవినాష్

సీతానగరం: మండలంలో సాగు చేస్తున్న వరిచేనులోను, వరి సాగు చేస్తున్న పరిసర ప్రాంతాల్లో ఆశించే తెగులు నివారణపై రైతులు అవగాహన కల్పించుకుని అధిక దిగుబడుల సాధనకు కృషి చేయాలని ఏఓ ఎస్.అవినాష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మండలంలోని బుడ్డిపేట గ్రామంలో వరిచేనులో తెగులు నివారణ, పరిసర ప్రాంతంలో కీటకాలు చేరకుండా ఉండడానికి తీసుకోవల్సిన జాగ్రత్తలపై రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి మాట్లాడుతూ పంటల పర్యావరణ పరిసరాల విశ్లేషణలో భాగంగా వరిచేనులో శత్రు పురుగులు ఆశించడంతో పాటు ఆకుముడత పురుగులను, తెగుళ్ళను,తెల్లదోమ, పచ్చదోమ,ఇతర పురుగులను గుర్తించామని తెలిపారు.

మిత్రపురుగులు అయిన తూనీగలు సాలీడు, అక్షింతల పురుగులను గమనించాలని సూచించినట్లు తెలిపారు. ఆకుముడత ఎక్కువగా ఉన్నట్లు గుర్తించడంతో దాని నివారణకు వేపగింజల కషాయాన్ని 5శాతంలేదా బ్రహ్మాస్త్రం రసాయనాలు లేదా క్లోరీఫైరీఫాస్ 2ఎంఎల్, ప్రొఫినో ఫాస్ 2 ఎంఎల్ వాడాలని గణాంకాలతో వివరించినట్లు తెలిపారు. తెగులు నివారణ అవనంతరం పంటల దిగుబడులకు మెలకువలను పాటించి వ్యసాయ శాఖ అధికార సిబ్బంది సహకారాన్ని తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు సుదీర్‌కు మార్, వినయ్, శ్రావణ్, బుడ్డిపేట వరిసాగు రైతులు పాల్గొన్నారు.

జీఓ 115 రద్దు చేయాలి



జిల్లా ఆస్పత్రి వద్ద ధర్నా చేస్తున్న స్టాఫ్‌నర్సులు

- జిల్లా ఆస్పత్రి వద్ద ధర్నా

పార్వతీపురం టౌన్: జీఓ నంబర్ 115ను రద్దుచేసి నోటిఫికేషన్ ద్వారా స్టాఫ్ నర్స్ పోస్టులు భర్తీ చేయాలని కాంట్రాక్ట్, ఓట్‌సోర్సింగ్ నర్సులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పార్వతీపురం జిల్లా ఆస్పత్రి వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా ఉన్న జీఓను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మూడున్నరేళ్ల జీఎన్ఎం కోర్సు, నాలుగేళ్ల బీఎస్సీ నర్సింగ్ కోర్సులు చదివి కొంత కాలంగా ప్రభుత్వాస్పత్రిలో సేవలు చేస్తున్నామని, ఇప్పుడు తమను కాదని సచివాలయాల్లో పనిచేస్తున్న ఏఎన్ఎంలను ఇక్కడ స్టాఫ్ నర్సులుగా నియమించేందుకు జీఓ ఇవ్వడం అన్యాయమని వాపోయారు. చిన్న చదువులు చదివిన వారికి పెద్ద ఉద్యోగాలు ఎలా ఇస్తారని, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ విధానంలో ప్రస్తుతం పని చేస్తున్న వారందరినీ రెగ్యులర్ చేశాక మిగతా వారికి అవకాశం ఇవ్వాలని కోరారు. ధర్నాలో పలువురు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ స్టాఫ్‌నర్సులు పాల్గొన్నారు.

వైద్య సమస్యలు పరిష్కరించాలి

సాలూరు: జిల్లావ్యాప్తంగా వైద్య ఆరోగ్య సమస్యలు, స్థానికంగా ఉన్న రోడ్లు, నివాస ప్రాంత సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు కోరారు. ఈ మేరకు బుధవారం పట్టణంలో నిర్వహించిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. మండలంలోని బొర్రవనుకువలస, జిల్లేడువలస,కుడుమూరు భూములు, సాలూరు, పాచిపెంట, మక్కువ రోడ్ల సమస్య పరిష్కారానికి పోరాడాలని కమిటీ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సాలూరు మక్కువ రోడ్డుపై కనీసం వాహనాలు వెళ్లడా నికి కూడా వీలులేని పరిస్థితి ఉందన్నారు. ఈ కారణంగా బస్సుసర్వీసులు నిలుపుదల చేయడంతో ప్రజలకు ఆర్థికభారం పెరిగి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలో ఉన్న భూ సమస్యలన్నింటిని పరిష్కరించాలని లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు అప్పారావు, సుందర్రావు, చినబాబు, జానకిరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గురుకులం నిర్మాణాలపై ఇంత నిర్లక్ష్యమా?

- ఏకలవ్య పాఠశాల భవన నిర్మాణాల జాప్యంపై మాజీ ఎమ్మెల్యే కళావతి మండిపాటు


ఏకలవ్య పాఠశాల భవన సముదాయంను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే వి.కళావతి, పార్టీ నాయకులు

భామిని:

ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాల భవనాల నిర్మాణాలపై ఇంత నిర్లక్ష్యం తగదని పాలకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి మండిపడ్డారు. భామిని మండల కేంద్రంలో నిర్మాణంలోని ఏకలవ్య మోడల్ స్కూల్ భవనాలను వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి బుధవారం ఆమె పరిశీలించారు. నిర్మాణ పనుల్లో జాప్యంపై సైట్ ఇంజినీర్ రమేష్‌ను వివరాలు అడిగి తెలుసుకుని అసంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి నిధుల కేటాయింపు జరుగుతున్నప్పటికీ భవన నిర్మాణాలు నత్తనడకన సాగడానికి కారణం ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడమే అని ఆరోపించారు. సుమారు రూ.12 కోట్లు వ్యయంతో నిర్మిస్తున్న భవనాల్లో 240 మంది విద్యార్థులకు వసతి కల్పించకపోవడం శోచనీయమన్నారు. భామిని ఏకలవ్య పాఠశాల తరగతులను కొత్తూరు మండలం మహాసింగి, సీతంపేట మండలం మల్లి ఆశ్రమ పాఠశాల్లో నిర్వహించడం బాధాకరమన్నారు. ఇరుకైన, కూలేందుకు సిద్ధంగా ఉన్న గదుల్లో విద్యార్థులు అభ్యసన సాగించలేక ఇంటిముఖం పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాత్కాలికంగా భామినిలో వసతి కల్పించలేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ప్రస్తుతం నిర్మాణం పూర్తి చేసుకున్న ఏడు భవనాలల్లో విద్యార్థులకు వసతి ఏర్పాటు చేయాలని కోరారు. వైస్ ఎంపీపీ బి.ధర్మారావు, ప్రత్యేక ఆహ్వానితులు తోట సింహాచలం, జేసీఎస్ కోఆర్డినేటర్ కె.చంద్రశేఖర్, పార్టీ నాయకులు జీ రమేష్, కే కృష్ణారావు, రొక్కం రమేష్, పి.హరికృష్ణ, వై.పాపినాయుడు, ఎస్.గౌరీష్, కార్యకర్తలున్నారు.